www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 27 ఆగస్టు 2024



డిఎస్‌పిని సన్మానించిన మందా శ్రీను

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

డిఎస్‌పి కార్యాలయంలో టిడిపి ఎస్‌సిసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు సోమవారం డిఎస్‌పి ఎన్.సుధాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే దళితుల సమస్యలు, కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరగా సానుకూలంగా స్పందించారు. దళితులకు అన్ని విధాల అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. దోషుల పట్ల నిష్పక్షపాతంగా వ్యవహరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కేతా నరసింహ, జడ శివ, కొమ్మినేని ప్రసాద్, జడ మధు, బూడ్సు హరి, తప్పెట ప్రసాద్ పాల్గొన్నారు.



డిఎస్‌పిని సన్మానిస్తున్న మందా శ్రీనివాసులు

నకిలీ పింఛన్లపై కొరడా!

3,513 పింఛనుదారులకు నోటీసులు
1,000 తప్పుడు సర్టిఫికెట్లుగా నిర్ధారణ
నేడు కలెక్టర్‌కు నివేదిక అందజేత

ఉమ్మడి జిల్లాలో వికలాంగ పింఛన్లపై కత్తెరింపు పిడుగు పడనుంది. 2024 సార్వత్రిక ఎన్నికల ముంగిట వికలాంగ పింఛన్లలో బోగస్ ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. కడప, అన్నమయ్య జిల్లా అధికార యంత్రాంగం 3,513 మంది వికలాంగ పింఛన్ దారుల, పలువురు అనుమానిత పింఛను దారులకు నోటీసులు జారీ చేసింది. ఇందులో 50 శాతం మందికిపైగా విచారణకు హాజరు కాలేదని తెలుస్తోంది. రీ అసెస్మెంట్ పరీక్షకు హాజరైన వారిలో సుమారు 1000 పైగా ఫేక్ సర్టిఫికెటుగా తేలినట్లు తెలుస్తోంది. త్వరలో వికలాంగ పెన్షన్ల నివేదికను కలెక్టర్‌కు అందించే అవకాశం ఉంది.



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లాలో 2,66,385 మంది ఫింఛనుదారులు ఉన్నారు. ప్రతి నెలా రూ.120 కోట్ల మేర చెల్లింపులు చేస్తోంది. 39,839 మంది వికలాంగ పింఛనుదారులు ఉన్నారు. 3,436 పింఛన్‌దారుల సదరం సర్టిఫికెట్లను అనుమానించి విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఒఎపి పింఛనుదారుల అనంతరం వికలాంగ పింఛనుదారులే అధికంగా ఉండడం గమనార్హం. కడప జిల్లాలో 3,436 పెన్షన్లు బోగస్ అని భావించింది. నోటీసులు సైతం జారీ చేసింది. అన్నమయ్య జిల్లాలో 2,23,436 మంది పెన్షనుదారులు ఉన్నారు. వీరికి సుమారు రూ.110 కోట్ల మేరకు చెల్లింపులు చేస్తోంది. వీరిలో 26,849 మంది వికలాంగ పింఛన్‌దారులు ఉన్నారు. 1040 మంది బెడెడ్ వికలాంగులు ఉండడం గమనార్హం. వెరసి ఉభయ జిల్లాలో 3,513 మంది వికలాంగ పింఛనుదారులపై విచారణ చేపట్టారు. కడప జిల్లాలో 60 శాతం మంది విచారణకు హాజరు గాకపోవడం గమనార్హం. మిగిలిన 40 శాతం పింఛనుదారులకు రీఅసెస్మెంట్ పరీక్షలు నిర్వహించగా 1,000 మందికిపైగా ఫేక్ సర్టిఫికెట్లుగా తేలింది. గుంటూరు, పశ్చిమగోదావరి వంటి ఇతర జిల్లాల నుంచి తెచ్చుకున్న సర్టిఫికెట్లు అధికంగా ఉన్నట్లు సమాచారం. పదేళ్ల కిందట సదరం సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యుల జాబితాను సైతం రూపొందించింది. ఫేక్ సర్టిఫికెట్లు మంజూరు చేసిన వైద్యనిపుణుల్లో ఆందోళన నెలకొంది. సర్టిఫికెట్లపై సంతకాలు లేకుండా సీళ్లు వేసిన ఉదంతాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటువంటి సర్టిఫికెట్ల జారీలో సచివాలయ డిఇఒ దగ్గర నుంచి వైద్య నిపుణుల వరకు ఎవరెవరి పాత్ర ఎంత అనే కోణంలో విచారించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రీ అసెస్మెంట్ పరీక్షల్లో అత్యధికంగా ఆర్థో, చెవిటి, ఒకటి మెంటల్లీ రిటార్డు సర్టిఫికెట్లు ఉన్నట్లు సమాచారం. మెంటల్లీ రిటార్డు సర్టిఫికెట్ ఒరిజినల్‌గా తేలినట్లు సమాచారం. ప్రభుత్వం వికలాంగత్వం తీవ్రత ఆధారంగా రూ.ఆరు వేల నుంచి రూ.10 వేల మేరకు పెన్షన్ చెల్లింపులు చేస్తోంది. పెరాలసిస్ వంటి మంచానికి పరిమితమైన రోగులకు రూ.15 వేల వరకు చెల్లిస్తోంది. ఇటువంటి తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగ పింఛనుదారులపై విచారణ చేపట్టారు.

రహదారులు రక్తసిక్తం



- వేర్వేరు సంఘటనల్లో ఎనిమిది మంది దుర్మరణం
- గువ్వల చెరువు ఘాట్‌రోడ్డులో ఐదుగురు.. దువ్వూరు వద్ద ముగ్గురు..
- ఆరుగురికి తీవ్రగాయాలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి
- కొండుగారిపల్లి వడ్డేపల్లిలో విషాద ఛాయలు



మృతులు వెంకటమ్మ, నాగలక్ష్మి, నాగయ్య, మహబూబ్ షరీఫ్ (ఫైల్‌ఫొటోలు)

కడప జిల్లాలోని రెండు వేర్వేరు ప్రాంతాలు రక్తసిక్తమయ్యాయి. భర్త మృతి చెందడంతో పెద్ద కర్మ అనంతరం జరిగే కార్యక్రమానికి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా నలుగురు దుర్మరణం చెందారు. వారితోపాటు కంటైనర్ డ్రైవర్ కూడా మత్యువాత పడ్డాడు. మరో సంఘటనలో తిరుమలకు వెళ్తూ ముగ్గురు దుర్మరణం చెందారు. ఈ రెండు ఘటనలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల కుటుంబాలు శోకసముద్రంలో మునిగాయి.

-చింతకొమ్మదిన్నె/చక్రాయపేట/రామాపురం/దువ్వూరు



నుజ్జునుజ్జు అయిన కారులో ఇరుక్కున్న మృతదేహాలు

కారును ఢీకొన్న కంటైనర్.. ఐదుగురు దుర్మరణం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని గువ్వల చెరువు ఘాట్‌లో 6వ మలుపు వద్ద సోమవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కారును కంటైనర్ ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కారులోని నలుగురు, కంటైనర్ డ్రైవర్ సహ ఐదుగురు మృతువ్యాత పడ్డారు. కారులోని నలుగురు తమ బంధువుల అంత్యక్రియలకు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. కారు నుజ్జునుజ్జు అయింది. కంటైనర్ లోయలో పడింది. కారులో ఉన్న మృతుల స్వస్థలం చక్రాయపేట మండలం వడ్డేపల్లి గ్రామస్తులుగా గుర్తించారు. విషయం తెలిసిన వెంటనే ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు..

చక్రాయపేట మండలం కుప్పం పంచాయతీ కొండుగారిపల్లె వడ్డేపల్లి గ్రామానికి చెందిన వల్లెపు చిన్న వెంకటమ్మ (50) భర్త ఇటీవల మృతిచెందాడు. అతని పెద్ద ఖర్మ కార్యక్రమ అనంతరం ఆమె తన తల్లి ఇంటికి గువ్వల చెరువుకు దీపం చూడడానికి తనకోడలు పల్లెపు నాగలక్ష్మి (35), కుమారుడు గుజ్జుగారినాగయ్య (46), చక్రాయపేట మండల ఉప్పలవారిపల్లె గ్రామానికి చెందిన కారు డ్రైవర్ మహ్మద్ షరీఫ్ (38) కారులో బయలు దేరారు. గువ్వల చెరువు ఘాట్ రోడ్డు వద్దకు రాగానే ఎదురుగు వస్తున్న కంటైనర్ కారును వేగంగా ఢీకొని లోయలోపడింది. ఈ సంఘటనలో కారులోని నలుగురితోపాటు, కంటైనర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందారు. కారు నుజ్జున్జు అయింది. క్లీనర్ పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న వెంటనే ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆయనోపాటు ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ వెంకటకుమార్, సికెదిన్నె సిఐ శంకర్‌నాయక్, రామాపురం సిఐ వెంకటకొండారెడ్డి, సిబ్బంది ఉన్నారు. పెద్ద కర్మ అనంతరం వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకోవడంతో కొండుగారిపల్లె వడ్డేపల్లి శోక సముద్రంలో మునిగింది.



ప్రమాదంలో మృతి చెందిన భగత్‌సింగ్, నాగలక్ష్మి, చిన్నారి కియాన్‌సింగ్

దువ్వూరు వద్ద కారు బోల్తా పడిన ఘటనలో ముగ్గురు..

దువ్వూరు మండల పరిధిలోని చింతకుంట వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పాప పుట్టిన వెంట్రుకలు తీయడానికి కోసం కర్నూలు నుంచి తిరుమలకు తుపాను వాహనంలో వెళ్తూ బోల్తాపడిన ఘటనలో ముగ్గురు మృతి చెందారు. నలురుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం 108 వాహనం సాయంతో ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాలు.. కర్నూలుకు చెందిన వారు పాట పుట్టిన వెంట్రుకలు తీయడానికి కోసం సోమవారం తుపాను వాహనంలో తిరుమలకు బయలుదేరారు. దువ్వూరు మండలం చింతకుంట వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కియాన్‌సింగ్ (9నెలలు), భగత్‌సింగ్ (34), నాగలక్ష్మి (55) మృతిచెందారు. మరో నలుగురు యుగంధర్, ఉమామహేశ్వరి, సాయి, కల్యాణ్‌సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దువ్వూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దువ్వూరు వద్ద బోల్తాపడిన ఘటనలో ధ్వంసమైన కారు

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు కూటమి ప్రభుత్వం రాష్ట్ర కేబినెట్ సమావేశంలో చర్చించి పరిష్కరించాలని ఎపి డిఎస్‌సి కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర కన్వీనర్ ఎర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, జిల్లా కన్వీనర్ కందుకూరి రామయ్య ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వెంటనే వర్తింపజేయాలని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖలోని మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ల(మేల్)బోగస్ సర్టిఫికెట్లను నిషేధించి ఏరివేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తెలిపారు. ఉద్యోగ విరమణ వయస్సును కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా 62 సంవత్సరాలకు పెంచాలని పేర్కొన్నారు. ఉద్యోగ నియామక సందర్భంగా కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లకు వంద శాతం వేతనాలు ఇచ్చిన విధానాన్ని పునరుద్ధరించాలని తెలిపారు. ప్రభుత్వ విధుల్లో ఉండి మరణించిన కాంట్రాక్టు ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియో మొత్తం ఇవ్వాలని పేర్కొన్నారు. విధుల్లో మరణించిన కాంట్రాక్టు ఉద్యోగులకు అంత్యక్రియలకు ఖర్చులు మొత్తం అందజేయాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్టు ఉద్యోగుల నియామక విధానాన్ని రద్దు చేయాలని కోరారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. లేకపోతే ఉద్యమాలు చేయాలి వస్తుందన్నారు.



మదనపల్లి సబ్ కలెక్టరేట్‌లో దగ్ధమైన ఫైళ్లు (ఫైల్ ఫొటో)

మదనపల్లెలో మళ్లీ మొదలైన అలజడి

ఫైళ్ల దగ్ధం కేసులో విచారణ ప్రారంభించిన సిఐడి
నేరస్తుల గుండెల్లో పరిగెడుతున్న రైళ్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టరేట్లో ఫైళ్ల దగ్ధం కేసు మరుగున పడింది అనుకుంటున్న తరుణంలో సోమవారం సిఐడి అధికారులు రంగంలోకి దిగడంతో మళ్లీ అలజడి మొదలైంది. సబ్ కలెక్టరేట్లో అడిషనల్ ఎస్‌పి రాజ్ కమల్, సిఐడి డిఎస్‌పి వేణుగోపాల్, మదనపల్లె డిఎస్‌పి కొండయ్య నాయుడు, మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్నారు.. సోమవారం రాత్రి నిమ్మనపల్లి విఆర్‌ఎ రమణయ్యతో పాటు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గౌతమ్ తేజ్‌లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కేసు మళ్లీ తోడి ఎక్కడ తమ గొంతుకు ఉరి బిగిస్తారోనని ఫైళ్ల దగ్ధం కేసులో ఉన్న నిందితులతో పాటు ఆ కేసులో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురి నేరస్తుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. సిఐడి రంగంలోకి దిగితే ఫైళ్ల దగ్ధం కేసు ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని స్థానికులు సైతం చెబుతున్నారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయానికి సిఐడి చీఫ్, అడిషనల్ డిజి రవిశంకర్ ఐఎన్‌ఆర్ కూడా వస్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం. మరుగున పడిపోయిందనుకున్న కేసు తిరిగి లోడుతుండడంతో ఒక్కొక్కరే బాగోతాలు బయటపడి ఉన్నాయి. జిల్లాలో 2.16 లక్షల ఎకరాలు ఫ్రీ హోల్డ్ అయ్యాయని రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియానే నేరుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు ఈ కేసులో మదనపల్లె పాత ఆర్‌డిఒలు మురళి, హరి ప్రసాద్, మదనపల్లి మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాష, వైసిపి నాయకులు, మాజీమంత్రి పెద్దిరెడ్డి అనుచరుడు రైస్‌మిల్ మాధవరెడ్డి, రిటైర్డ్ పోస్టల్ రమణారెడ్డిలతో పాటు మరికొందరిపై కేసులు నమోదైన విషయం తెలిసిందే.

నిరుద్యోగ సమస్యలపై చర్చించాలి

ప్రజాశక్తి- రాయచోటి

ఈ నెల 28న నిర్వహించే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగుల సమస్యలపైన వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులపైన నూతన కూటమి ప్రభుత్వం చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పిడిఎస్‌యు సమావేశంలో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం గ్రామ సచివాలయ పోస్టు వార్డు వాలంటీర్ల పోస్టులు తప్ప ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగాలు నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిందని మండిపడ్డారు.అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు వైసిపి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగుల బతుకులు మారుతాయి నోటిఫికేషన్లు, ఉద్యోగాలు వస్తాయని ఆశతో కూటమి ప్రభుత్వానికి అత్యధిక మెజారిటీతో ప్రధానంగా నిరుద్యోగ యువత ఓట్లు వేశారన్నారు. నిరుద్యోగుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డిఎస్‌సి పరీక్ష ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్ లైన్‌లో నిర్వహించాలని వెంటనే మంత్రివర్గం సమావేశంలో చేసి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్ యు జిల్లా నాయకులు ఆనంద్, నరేష్, ఖాజావలి, రామచంద్ర, వెంకటేశ్వర్ రెడ్డి, పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలో సోమవారం ఘనంగా తీజ్ ఉత్సవాలు, గిరిజన నృత్యాలతో శోభయాత్ర చేసినట్లు తీజ్ ఉత్సవ కమిటీ సభ్యులు బుక్కే విశ్వనాథ నాయక్, రాందాస్ నాయక్, మదన్మోహన్ నాయక్, రామానుజన్ నాయక్, అన్నయ్య నాయక్, శంకర్ నాయక్, బిల్లు నాయక్, నారాయణ నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తీజ్ ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ బంజారా పండుగలలో అతి ముఖ్యమైన పండుగ తీజ్ ఈ పండుగ బంజారా సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకని పేర్కొన్నారు. పెళ్లికాని ఆడపడుచులు కలలు పండుగా భిన్నమైన సాంప్రదాయ పద్ధతులు అతి పవిత్రంగా తొమ్మిది రోజులు పాటు జరిగే వేడుకని చెప్పారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని పాడిపంటలు సస్యశ్యామలంగా ఉండాలని బంజారా కన్నెపిల్లలు తేజ్ బుట్టలు పెట్టి గోధుమ విత్తనాలు విత్తి తీజ్ దీక్ష చేపట్టి తొమ్మిది రోజులు పాటు నీరు పోసి నారు పెంచి మొక్కలు తీర్చుతూ అనంతరం బుట్టలను నీటిలో కలిపివేస్తారు. షిరిడి సాయిబాబా గుడి దగ్గర నుండి బంగ్లా సర్కిల్ వరకు తిజ్ ఉత్సవ శోభాయాత్ర చేసి అనంతరం మహిళలు, యువతులు సంప్రదాయ గిరిజన నృత్యాలతో అలరించారు. ఈ వేడుకల్లో గిరిజనులు మాంసంతో చేసిన సలోయి వంటకం ప్రత్యేకంగా నిలుస్తుంది కార్యక్రమంలో మూడే వినోద్ నాయక్, తిరుపాల్ నాయక్ రామాంజులు నాయక్, రఘునాథ నాయక్, చక్రే నాయక్, శ్రీనివాసులు నాయక్, నాగమణి నాయక్, తదితరులు పాల్గొన్నారు.



గోధుమ నారు తలపై పెట్టుకుని నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు

యుపిఎస్ ఆమోదయోగ్యం కాదు : యుటిఎఫ్

ప్రజాశక్తి-రాయచోటి

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఏకీకృత పెన్షన్ స్కీమ్ (యుపిఎస్) ఆమోదయోగ్యం కాదని, దానిని అంగీకరించే ప్రశ్నే లేదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబిర్ అన్నారు. సోమవారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఉద్యోగులను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం కేవలం ఎన్‌పిఎస్ పేరును యుపిఎస్‌గా మార్చిందని విమర్శించారు. 25 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ గ్యారంటీ చేస్తున్నట్లు, సర్వీసులో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 60 శాతం ఫ్యామిలీ పెన్షన్ ఇస్తామని యుపిఎస్ పెన్షన్ విధానంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌తో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దు చేసే విషయాన్ని ఇందులో ప్రస్తావించకపోవడం, పైగా ఈ పథకం అమలు ఐచ్చికం అని పేర్కొనడంలోనే అసలు మోసం దాగి ఉందని పేర్కొన్నారు. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ లేకుండా సర్వీసును బట్టి 50 శాతం పెన్షన్ ఇచ్చే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడమే తమకు ఆమోదయోగ్యమని పేర్కొన్నారు. యుపిఎస్ అనేది కేవలం ఆంధ్రప్రదేశ్ యొక్క అష్యూర్డ్ పెన్షన్ స్కీమ్ యొక్క కాపీ అని, నూతన పెన్షన్ పథకం యొక్క సంస్కరణకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుందని, ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్) అమలు అనేది దేశవ్యాప్తంగా ముఖ్యమైన రాజకీయ సమస్యగా మారిందని, గత లోక్‌సభ ఎన్నికలను సైతం ఇది ప్రభావితం చేసిందని తెలిపారు. ఉద్యోగులలో వ్యతిరేకత మరియు సమీప భవిష్యత్తులో రాజకీయ పరిణామాలను పరిగణనలోకి తీసుకుని, కనీస ఉపశమనం అందించడానికి కేంద్ర ప్రభుత్వం యొక్క ఎత్తుగడ, మోసపూరిత వ్యూహంగా ఏకీకృత పెన్షన్ పథకం (యుపిఎస్) విధానాన్ని ప్రవేశపెట్టిందని విమర్శించారు. పాత పెన్షన్ పథకానికి ప్రత్యామ్నాయంగా ఏకీకృత పెన్షన్ పథకం అమలు ఆమోదయోగ్యం కాదని, పాత పెన్షన్ పథకాన్ని పూర్తిగా పునరుద్ధరిడమే ఏకైక పరిష్కారమని తెలిపారు. పాత పెన్షన్ అమలు కోసం ఎఫ్‌ఆర్డిఏ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ అమలయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ నాయుడు, జిల్లా సహాధ్యక్షులు శివారెడ్డి, జిల్లా సిపిఎస్ కన్వీనర్ రమణమూర్తి, జిల్లా కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, అక్రమ్‌బాష, శ్రీధర్ రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ శివారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ సీజ్

- వెంటాడి పట్టించిన సిపిఎం నాయకులు
- ఇసుక, మట్టి అక్రమాలపై ప్రజా ఉద్యమం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మట్టిని అక్రమంగా తరలిస్తున్న ఎంఎస్‌ఆర్ కంపెనీ టిప్పర్‌ను రెవెన్యూ అధికారులు, పోలీసులు సోమవారం సీజ్ చేశారు. మండలంలోని అంకిశెట్టిపల్లి చెరువు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా హిటాచితో మట్టిని తవ్వుకుని టిప్పర్ల ద్వారా చిప్పిలి పాల డెయిరీ పక్కన ఉన్న వెంచర్‌కు తరలిస్తూ భూమిని చదును చేస్తున్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినా వారు స్పందించలేదు. మట్టితో వెళ్తున్న ఎంఎస్‌ఆర్ కంపెనీ పేరు ఉన్న టిప్పర్‌ను వెంబడించి చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పక్కన హంద్రీ-నీవా కాలువ గట్టుపైన అడ్డుకుని అనుమతి పత్రాలు చూపించమని అడిగారు. టిప్పర్ డ్రైవర్ నాకు ఏమీ తెలియదని, నేను ఈ రోజే పనిలోకి వచ్చానంటూ అక్కడి నుండి పరారయ్యాడు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన తర్వాత అంకిశెట్టిపల్లి విఆర్‌ఒ చంద్ర మోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని టిప్పర్‌ను సీజ్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాలూకా పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఉమా మహేశ్వర్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని టిప్పర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ అధికారులు మాఫియాతో సత్సంభందాలు ఉన్నందునే ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతూ తరలింపు ఆగడం లేదన్నారు. దాదాపు వారం రోజుల నుండి అనేక చోట్ల ఇసుక, మట్టి అక్రమ నిల్వలు సిపిఎం చూపించినా వాటిని స్వాధీనం చేసుకునేందుకు ముందుకు రాకపోవడంలోని అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. బార్లపల్లి వద్ద చూపించిన ఇసుకను సీజ్ చేసినట్లు ప్రకటించినా దాని వెనుక ఎవరు ఉన్నారనే విషయం ఎందుకు తేల్చలేక పోయారని పేర్కొన్నారు. మట్టిని అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకుని అధికారులకు సమాచారం ఇచ్చినా సకాలంలో స్పందించక పోవడం దుర్మార్గమన్నారు. ఇసుక, మట్టి అక్రమ తరలింపులకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు ఇసుక, మట్టి మాఫియాపై ఉక్కుపాదం మోపి అరికట్టాలని కోరారు.



మట్టి టిప్పర్‌ను సీజ్ చేసిన అధికారులు

నూతన ధర్మకర్త మండలి ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంకు సంబంధించి నూతన ధర్మకర్త మండలి ఏర్పాటు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆలయ కార్యనిర్వాహణ అధికారి డి.వి.రమణరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు నోటిఫికేషన్ వెలువడిన 20 రోజుల లోపు దరఖాస్తులను డిప్యూటీ కమిషనరు, ఎండోమెంట్స్ డిపార్టుమెంటు, కృష్ణా నగర్ స్ట్రీట్, కర్నూలు కార్యాలయానికి నేరుగా సమర్పించాలని తెలిపారు. దరఖాస్తు కోసం ఆలయంలో లభిస్తాయన్నారు.



ప్రమాదాలు జరగకుండా కాలువను పూడ్చివేస్తున్న సర్పంచ్

కాలువ పూడ్చివేత..స్థానికుల హర్షం

ప్రజాశక్తి- కలకడ

ప్రమాదాలకు నిలయంగా ఉన్న కాలువను పూడ్చివేసినట్లు మాజీ ఎంపిటి వంగిమల మధుసూదన్ రెడ్డి కదిరాయ చెరువు సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న కమల్‌నాథ్ కలిసి కాలువను పూడ్చివేసినట్లు తెలిపారు. మండలంలోని కదిరాయ చెరువు పంచాయతీ నవాబుపేట పంచాయతీలకు అనుసంధానంగా ఉన్న హంద్రీ-నీవా కాలువ పూర్తి చేసినట్లు తెలిపారు. కలకడ నుండి గుర్రంకొండకు వెళ్లే దారిలో ఉన్న హంద్రీ-నీవా కాలువను గతంలో ఏర్పాటు చేశారు. ఈ కాలువ రోడ్డుకు మధ్యలో ఉండటంతో గతంలో ఎంతో మంది ద్విచక్ర వాహనదారులు కాలువలో పడి మృతి చెందిన సంఘటనలు ఎన్నో జరిగినట్లు తెలిపారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరగకుండా నివారించే క్రమంలో కాలువను వారి ఇరువురు సొంత నిధులతో పూడ్చి దారిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రమాదాలు జరగకుండా దారి ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



నానికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మన టిడిపి విభాగం పనితీరు ప్రశంసనీయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

2024లో కూటమి అధికారం చేజిక్కించుకోవడంలో మన టిడిపి విభాగం పనితీరు ప్రశంసనీయమని ఎమ్మెల్యే షాజహాన్ బాషా కితాబిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా మన టిడిపి విభాగంలో సమర్థవంతంగా పనిచేసిన వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసా పత్రాలను అందించారు. ఇందులో భాగంగా మదనపల్లి నియోజకవర్గంలో మన టిడిపి విభాగంలో చురుకుగా పనిచేసిన నిరంజన్ నానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా శాలువాతో సత్కరించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఏ విభాగంలోనైనా సమర్థవంతంగా పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ముఖ్యంగా టిడిపిని అధికారంలోకి తీసుకురావడానికి మన టిడిపి విభాగం క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. అనంతరం నిరంజన్ నాని మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో శక్తి వంచన లేకుండా పనిచేశాను, మన టిడిపి యాప్ ద్వారా తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లామన్నారు. తమ శ్రమకు లభించిన ప్రతిఫలమే ఈ ప్రశంసా పత్రమన్నారు. భవిష్యత్తులో మరింత కష్టపడి పనిచేసి తెలుగుదేశం పార్టీని తిరుగులేని శక్తిగా తయారు చేస్తామని స్పష్టం చేశారు.



అవార్డు అందుకుంటున్న అబూబకర్ సిద్ధిక్

సిద్ధిక్‌కు మదర్ థెరిసా జాతీయ అవార్డ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదర్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ రెండవ వార్షికోత్సవం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని విజయవాడలో హనుమంతరాయ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. మదర్ సర్వీస్ సొసైటీ రెండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సమాజసేవకు అంకితమై వివిధ రంగాల్లో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తున్న వారిని ప్రోత్సహిస్తు స్వతంత్ర సమరయోధులు మహనీయుల ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలలోని స్వచ్ఛంద సేవకులకు జాతీయ అవార్డులు ప్రదానం చేశారు. హెల్పింగ్ మైండ్స్ సేవలకుగాను మదర్ థెరిస్సా జాతీయ అవార్డును హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్ధిక్‌కు దుశ్శాలువ కప్పి, ప్రశంస పత్రంతో అవార్డ్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో మదర్ సర్వీస్ సొసైటీ సంస్థ అధ్యక్షులు మల్లాది ప్రసాదరావు, హ్యూమన్ రైట్స్ ఫౌండర్ బొడ్డుపాటి దాస్, సినీ నిర్మాత ముసా అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - నందలూరు



మాట్లాడుతున్న డిఎస్‌పి సుధాకర్

అసాంఘిక కార్యక్రమాలకు ఎవరు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని రాజంపేట డిఎస్‌పి సుధాకర్ హెచ్చరించారు. సోమవారం నందలూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లోని పలు రికార్డులను, రెండు గ్రేవ్ కేసుల ఫైళ్లను పరిశీలించారు. ఒక గ్రేవ్ కేసులో ముద్దాయి అరెస్టు పెండింగ్ ఉన్నందున, ఒక వారంలోగా అరెస్టు చెయ్యమని ఎస్సై వెంకటేశ్వర్లకు ఆదేశించారు. కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, మండల పరిధిలో శాంతి భద్రతలు పరిరక్షించాలని, అసాంఘిక కార్యక్రమాలు అరికట్టాలని, రోడ్డు ప్రమాదాలు నివారించాలని, స్థానిక బస్టాండ్ కూడలిలో ట్రాఫిక్ ను నియంత్రించాలని, సిబ్బందికి తెలియజేశారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



తంబళ్లపల్లె : గోపిక, కృష్ణుడి వేషధారణలో చిన్నారులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం పట్టణంలోని అనపగుట్ట, గోవర్ధనగిరిపై వెలసిన శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకృష్ణుని ఆలయం నిర్మాణం ఎంతో అద్భుతంగా ఉందని, రాయలసీమకే తలమానికంగా ఈ ఆలయం ఉందని కితాబిచ్చారు. కృష్ణాష్టమి వేడుకలకు బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేశారని, ఇందుకు ఆలయ కమిటీ ఎంతో కృషి చేసిమదన్నారు. భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకి స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్వామివారి దర్శనార్థం విచ్చేసిన భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. **కలకడ:** మండలంలో భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించుకున్నారు. మండల కేంద్రమైన కలకడలో ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించినట్లు ఆలయ పూజారి త్రికుటం విజయ సారధి స్వామి తెలిపారు. **కలికిరి:** మండలంలో కృష్ణాష్టమి వేడుకలు వాడవాడలో వైభవంగా నిర్వహించారు. మండలంలోని గుట్టపాలెం పంచాయతీ వాడవాండ్లపల్లి కృష్ణాపురంలోని శ్రీకృష్ణుని ఆలయంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. **రైల్వేకోడూరు:** మండలంలోని మైసూరువారిపల్లె పంచాయతీ పరిధిలోని మామిడికాయల మండిల సమీపంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా భక్తులు పోటెత్తారు. దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు తిరు కళ్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **రామసముద్రం :** మండల వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు కృష్ణుడి వేషం అలంకరించారు. **తంబళ్లపల్లి :**మండలంలో కృష్ణాష్టమి సందర్భంగా తల్లిదండ్రులు చిన్నారులకు శ్రీకృష్ణుడు రాధా, గోపిక, సత్యభామ వేషధారణ చేశారు. చిన్నారుల వేషధారణ అలరింప చేశాయి. మల్లయ్య కొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. కొండపైన భక్తులకు అన్నదానం చేశారు. **రామాపురం:** రామాపురం మండలం బండపల్లె సమీపంలోని ప్రేమాలయంలోని శ్రీకృష్ణా ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రేమాలయం నిర్వాహకులు చింతం మధుసూధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో రెస్కో మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపిపి ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, గంగిరెడ్డి, రవిరెడ్డి, మాజీ ఎంపిటిసి రమణ యాదవ్, లక్ష్మయ్య యాదవ్ పాల్గొన్నారు. **రాయచోటి :** పాత గొల్లపల్లిలో వెలసిన శ్రీకృష్ణా ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం హాజరయ్యారు. కృష్ణాష్టమి సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. యాదవ కులస్తులు సుగవాసి బాలసుబ్రమణ్యంను ఆలయ కమిటీ సభ్యులు యాదవ వంశీయులు ఆయనను దుశ్యాలవతో సన్మానించినారు. కార్యక్రమంలో యాదవ వంశీలను ఆయన సత్కరించారు. గుడి నిర్మాణం కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వాగ్దేవి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు నాగేంద్ర యాదవ్, ఉపాధ్యాయులు, రామచంద్ర, హరి, కృష్ణయ్య పాల్గొన్నారు.



రామసముద్రం : కృష్ణుడి వేషధారణలో చిన్నారి

కర్నూలుపై నెల్లూరు జట్టు విజయం



తలపడుతున్న కర్నూలు, నెల్లూరు జట్లు

పజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిసౌత్ జోన్ అండర్ -23 మల్టీ డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై రెండు వికెట్ల తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 259 పరుగులు చేసింది. నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 174 పరుగులు చేసింది. రెండవ ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 237 పరుగులు చేసింది. వికెట్ నష్టపోకుండా 51 పరుగుల ఓవర్ నైట్ కోరుతూ చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు రెండవ 67.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 323 పరుగులు చేసి రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ జట్టులోని షేక్ బాజీ 55, మాధవ్ 79 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని కనిష్ 3 సాయి సూర్య తేజ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు.

కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో కడప, చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 450 పరుగులు చేసింది. కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 245 పరుగులు చేసింది. వికెట్ నష్టపోకుండా 13 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండవ ఇన్నింగ్స్ లో 70.0 ఓవర్లలో 231 పరుగులు చేసింది. ఆ జట్టులోని నికిత్ గౌడ్ 71, భవానీ ప్రసాద్ 45 పరుగులు చేశారు. కడప జట్టులోని ఎస్ఎండి. అస్లాం నాలుగు, విజయ్ భావేంద్రారెడ్డి మూడు వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 28.0 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. ఆ జట్టులోని శివ కేశవ రాయల్ 71 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని డేనియల్ దాస్ రెండు వికెట్లు తీసుకున్నాడు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్ లో చిత్తూరు జట్టు ఆదిత్య సాధించింది.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-కలికిరి

అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ రెడ్డి శేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని రౌడీ షీటర్లు, సారా విక్రేతలను పిలిపించి రౌడీ షీటర్ల ప్రవర్తన గురించి విచారించి, పాత నేరాలపై ఆరా తీసి మండలంలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు గాని ఇతరత్రా కార్యక్రమాలు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారా విక్రతులపై కఠిన చర్యలు ఉంటాయని ఎక్కడ కూడా సారా వండడం, అమ్మడం నిషేధమని నిబంధనలకు అతిక్రమిస్తే ఎవరైనా కచ్చితంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మండలంలో ఎక్కడ కూడా సారా విక్రతల గాని రౌడీ షీటర్లు కానీ ఇతరత్రా కార్యకర్తల పాల్పడితే మండలంలోని ప్రజలు అందరూ కూడా సహకరించి తమకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ శేఖర్‌రెడ్డి

రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గత ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్రం సర్వనాశనమైందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో చేసిన అప్పులతో ఆదాయం కన్నా చెల్లింపులే ఎక్కువగా ఉన్నాయని, రాష్ట్రానికి రాజధాని లేదని, క్యాపిటల్ సిటీ ఎక్కడ అంటే ఆకాశంవైపు చూపాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మదనపల్లి మున్సిపాలిటీకి చెందిన రూ.20 కోట్లు సాధారణ నిధులు ప్రభుత్వం ఖజానా జీరో అకౌంటుకు చేరాయని ఆరోపించారు. పారిశుధ్య విభాగంలో వున్న సిబ్బందిని తొలగించడం జరిగిందని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితిలో చంద్రబాబుపైన విశ్వాసంతో 164 సీట్లు ఇచ్చిన ఘనత రాష్ట్ర ప్రజలదేనన్నారు. సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పనిచేసే వ్యక్తి చంద్రబాబు నాయుడని కితాబునిచ్చారు. మదనపల్లి నియోజకవర్గంలో సరైన మురుగునీటి వ్యవస్థ లేని కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఈ పరిస్థితుల్లో కాలువలు రోడ్లు నిర్మాణానికిగాను రూ.12 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గోకులంలో 25 షెడ్లు అర్హులైన వారికీ ఇచ్చి న్యాయం చేస్తామన్నారు. అదనంగా మరిన్ని వచ్చేలా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి మాట్లాడుతానన్నారు. మదనపల్లె మున్సిపాలిటీలో గోతులు మయమైన రోడ్లు, పట్టణ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో పాటు రోడ్లు విస్తరణ చేసి అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. వర్షం కురిస్తే నీరు వెళ్లలేని పరిస్థితి చాలా ప్రదేశాల్లో నెలకొన్నదని, ఈ నేపథ్యంలో గతంలో కురిసిన వర్షానికి కోమటివానిచెరువు నిండి గండి పడే పరిస్థితి ఉంటే అప్పటికప్పుడు చెరువులో వ్యర్థాలు తొలగించడం మొరవ ద్వారా వెళ్లే పరిస్థితి పునరుద్ధరణ చేయడం జరిగిందన్నారు. చెరువులో బోటింగ్, చెరువు చుట్టూ డ్రెయినేజి వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు రామ్ నగర్ పార్క్ అభివృద్ధిని విస్మరించారన్నారు. నియోజక వర్గంలోని ప్రజలు నేరుగా తనను కలిసి వారి సమస్యలు చెప్పడం జరుగుతోందని వారి సమస్యలు పరిష్కారంతో పాటు నియోజకవర్గం అభివృద్ధి ఏకైక అజెండాగా పనిచేస్తున్నట్లు చెప్పారు. పార్టీని గెలిపించిన వారికి పెద్దపీట వేయడంతోపాటు వారు ఏమీ అడిగిన చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు నాదెళ్ల విద్యా సాగర్, నవీన్ చౌదరి, సుదీళ్ల సుధాకర్, గౌస్ అజాం, బొమ్మిశెట్టి పురుషోత్తం, యర్రబల్లి వెంకటరమణా రెడ్డి, ముసలి కుంట నాగయ్య, ప్రభాకర్, కత్తి లక్ష్మన్న, బాబు నాయుడు, రాధమ్మ, నాగూర్ వలి, షంషీర్, జెసిబి వేణు, జేసీబీ మధుసూదన్ రెడ్డి, లతీఫ్, మంజు, పూలకుంట్ల హరిబాబు పాల్గొన్నారు.

'సుగవాసి'కి సన్మానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సుగవాసి బాలసుబ్రమణ్యంను సోమవారం ఆ పార్టీ సీనియర్ నాయకులు ఘనంగా సన్మానించారు. టిడిపి లీగల్ సెల్ కార్యాలయంలో టిడిపి నాయకులు నేతలు సుగవాసి బాలసుబ్రమణ్యంను కలిసి ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలకు సంబంధించిన జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సుగవాసి మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో కూటమిలోని ఏ కార్యకర్తకు, ఏ అవసరం వచ్చినా తాను ముందుండి సహాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి లీగల్‌సెల్ అధ్యక్షులు తరిగోపుల లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత వెంకటరమణ, టిడిపి మాజీ మండలాధ్యక్షులు సంజీవరావు, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ళ చంద్రమౌళి, బలిజ సంఘం నాయకులు కె.ఎస్. నరసింహ, డాక్టర్ నవీన్ కుమార్, వెంకటేశ్వర్లు నాయుడు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు శామీర్ భాష, మల్లిఖార్జున నాయుడు, చంద్ర, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సుధాకర్, ఒంటిమిట్ట బాష, వినోద్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న పాత్రికేయులు

సొంతింటి కలను సాకారం చేస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లిలో పనిచేస్తున్న పాత్రికేయులకు ఇంటి స్థలాలతోపాటు ఇండ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హామీ ఇచ్చారు. సోమవారం మదనపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షులు రమేష్ అధ్యక్షతన స్థానిక ఎమ్మెల్యే స్వగృహం వద్ద ఎమ్మెల్యే షాజహాన్ బాషాను కలుసుకొని సుధీర్ఘ కాలంగా కలగానే మిగిలి పోయిన పాత్రికేయులకు ఇంటి పట్టాలను మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ పాత్రికేయులు అందరికీ ఇంటి స్థలాలను మంజూరు చేయడమే కాకుండా హౌసింగ్‌ను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. పాత్రికేయులకు ఇంటి పట్టాలతో పాటు హౌసింగ్ సొసైటీ కింద ఇళ్ళ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. అర్హులైన వారందరికీ న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రమేష్, కోశాధికారి కిరణ్ మాట్లాడుతూ పాత్రికేయుల ఇంటి పట్టాలు, ఇంటి స్థలాలు, ఇండ్లు మంజూరు చేయడంపైన సానుకులంగా స్పందించిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చొరవతోనే విలేకరుల సుధీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న నిరీక్షణకు తెరపడనుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కమిటీ ప్రతినిధులు, పాత్రికేయ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



మదర్ థెరిసా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

విశ్వమాత మదర్ థెరిసా : జెవివి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రపంచానికి సేవా భావాన్ని చాటి విశ్వమాతలా మదర్ థెరిసా పేరుగాంచారని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. సోమవారం మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకొని స్థానిక తరిగొండ రోడ్డులోని ఎపి మైనార్టీ బాలికల గురుకుల పాఠ శాలలో మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సేవకురాలు మదర్ థెరిసాను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విదేశీ యురాలైన మదర్ థెరీసా 45 ఏళ్ల పాటుగా మిషనరీస్ అఫ్ ఛారిటీని భారతదేశం, ఇతర దేశాలలో వ్యాపించేలా మార్గదర్శకత్వం వహిస్తూ పేదలకు, రోగులకు, అనాథలకు, మరణశయ్యపై ఉన్నవారికి మదర్ థెరిసా పరిచర్యలు చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాస్మిన్ భాను, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి నాయకులకు శ్రీకాంత్‌రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : పట్టణంలో అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి పొందుతున్న వైసిపి నాయకులను సోమవారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పరామర్శించారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష తండ్రి ఇలియాస్ బాషను, గుండె సంబంధిత సమస్యకు స్టెంట్ వేయించుకుని వాల్మీకి స్ట్రీట్‌లో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్ఆర్ సిపి నాయకుడు అష్రఫ్ ను శ్రీకాంత్ రెడ్డి పరామర్శించి ఆరోగ్యపరిస్థితులనడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలిమి హారూన్ బాష, వైసిపి పట్టణ అధ్యక్షులు రియాజుర్ రెహమాన్, ఖలీల్, ఎ.కె.పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో వైరల్, డెంగీ జ్వరాల కేసులు అధిక మవడంతో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టినట్లు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కోసువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుండ్లపల్లి గ్రామం, దిగువపల్లి. ఆర్ఎన్ తండా ఫీవర్ సర్వే, లార్వా సర్వే, నిర్వహించి నిల్వలున్న నీటిలో నీటి కాలువలను అబేట్ పిచికారి చేశారు. కార్యక్రమలో సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్త అరుణ, సునీత, హేమ లత, కుమారి, సర్వైజర్ అమరావతి, హెల్త్ అసిస్టెంట్, కృష్ణనాయక్, ఆషా దొడ్డెమ్మ పాల్గొన్నారు.



వీధుల్లో బ్లీచింగ్ చలుతున్న సిబ్బంది

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనాలు ఢీ : వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి



మృతి చెందిన శ్రీనివాసులు

ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన నిమ్మనపల్లి మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నిమ్మనపల్లె పంచాయతీ దేవళం కురవపల్లెకు చెందిన దేవరింటి శ్రీనివాసులు(55) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో అతను ఆదివారం కూడా అగ్రహారం సమీపంలో కూలీ పనులు ముగించుకొని రాత్రి ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా, నిమ్మనపల్లె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన చలపతి కుమారుడు గాలేటి ఆదర్శ్ ద్విచక్ర వాహనంపై అతివేగంగా వస్తూ అగ్రహారం రోడ్డులోని అమ్మక్కమాను వద్ద శ్రీనివాసులును ఢీకొనడంతో ఒక్కసారిగా అతను రోడ్డుపై కుప్పకూలిపోయారన్నారు. అతని తల వెనుక భాగంపై తీవ్ర గాయమై రక్తస్రావం జరిగిందన్నారు. యువకుడు తలపై కూడా గాయాలైనట్లు తెలిపారు. ఇరువురిని నిమ్మనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించగా అక్కడ వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదర్శ్‌ను ప్రయివేటు వాహనంలో తిరుపతికి బంధువులు తీసుకెళ్లగా, శ్రీనివాసులను 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే తీవ్ర రక్తస్రావంతో అతను మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రమాద సంఘటనపై ఎస్‌పి తిప్పేస్వామి వివరాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.